
సాక్షి ఒడిశా

ఆదివారం । 24 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు: రూ.429849
బంగారం: 1 గ్రాము 50 మిల్లీ గ్రాములు
వెండి: 28 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



మార్కెట్‌కు రంగుల కళ

హోలీ సందర్భంగా మార్కెట్ కళకళలాడుతోంది. రంగుల సామగ్రితో దుకాణాలు కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. రంగులు, పైపులు, టోపీలు, మాస్కులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిగాయి.

-IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
ఆది (సా)	సోమ (ఉ)
6.04	4.33

న్యూస్‌రీల్

ఏప్రిల్ 19 నుంచి మజ్జిగౌరి చైత్రోత్సవాలు



మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు ఏప్రిల్ 19 నుంచి ప్రారంభమవుతాయి. 18న సాయంత్రం జంఝావతి నది నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చి అమ్మవారి సన్నిధిలో ఉంచి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఎప్పట్లాగే ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.13 లక్షలు వెచ్చించేందుకు కమిటీ ఆమోదించినట్లు చెప్పారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అమ్మవారికి ఆవాహన పూజలతో పాటు చండీ హోమం నిర్వహించేందుకు ప్రత్యేకంగా పురోహితులను రప్పిస్తున్నట్లు వివరించారు.

ఎంపీ భర్తృహరి మహతాబ్‌పై కోర్టు అభియోగం

భువనేశ్వర్: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ)ని కొట్టినందుకు కటక్ లోక్‌సభ ఎంపీ భర్తృహరి మహతాబ్‌పై కటక్‌లోని ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు అభియోగాలు మోపింది. 2011 జనవరి 23న కటక్‌లో నేతాజీ జన్మస్థలం మ్యూజియంలో జరిగిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు ఎంపీ వెళుతున్న సమయంలో ఎస్‌ఐ అమితాబ్ మహాపాత్రోను కొట్టారంటూ అప్పట్లో కలకలం రేగింది. ఆ సమయంలో అమితాబ్ మహాపాత్రో దర్గా బజార్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణ జరిపిన పోలీసులు కోర్టులో నేరారోపణ వివరాలు దాఖలు చేశారు. ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేటు కోర్టు జేఎంఎఫ్‌సీ నియమించిన న్యాయమూర్తి దీపాంకర్ బొలా ఐపీసీ 341, 323, 294, 353 , 506 సెక్షన్ల కింద ఎంపీ భర్తృహరి మహతాబ్‌పై అభియోగాలు ఖరారు చేశారు. ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 5కు కోర్టు వాయిదా వేసింది. కాగా,అమితాబ్ ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

రాయగడ: ఎటువంటి అనుమతులు లేకుండా నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఓఎంసీ అధికారులు పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తుండటంతో ఒక్కో ట్రాక్టరుకు రూ.20 వేల జరిమానా విధించారు. కొత్తపేట, కొంధొమల్లి ప్రాంతాల నుంచి నాగావళి నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఒడిశా మైనింగ్ అధికారులు చందిలి పోలీసుల సహకారంతో ఈ దాడులు జరిపారు.

గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టికెట్లు



కాంగ్రెస్ గ్యారెంటీల కరపత్రాలను చూపిస్తున్న పండా, గొమాంగో తదితరులు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోందని, గెలిచే అవకాశాలు ఉన్న వారికే టికెట్లు కేటాయిస్తోందని పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా స్పష్టం చేశారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనప్పటికీ ప్రజలతో సత్సంబంధాలు ఉండటమే ప్రామాణికమని చెప్పారు. టికెట్ ఎవరికి వచ్చిన పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాల్సిందిగా కార్యకర్తలకు మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని తెలిపారు. బీజేడీకి కాలం చెల్లిందన్నారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యురాలు రత్నమణి ఉలక, సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక, డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు.

అంత్యదశకు ఆధిపత్య పోరు!

- తరతరాలుగా పోటీలో రమేష్ మజ్జి, ప్రదీప్ మజ్జి కుటుంబాలు
- ఈసారి ఎన్నికలతో దశాబ్దాల రాజకీయ పోరు ముగిసినట్లే..
- ఒకే కుటుంబం.. ఒకే టికెట్ ప్రతిపదనతో కలిసి పనిచేయాల్సిన పరిస్థితి



భువనేశ్వర్‌లోని బీజేడీ కేంద్ర కార్యాలయం శంఖభవన్‌లో రమేష్ మజ్జి-ప్రదీప్ మజ్జి చిరుదరహాసాలు

కొరాపుట్: దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ పోరు ముగింపు దశకు వచ్చింది. నబరంగ్‌పూర్ జిల్లా రాజకీయాల్లో ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మజ్జి కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు ఈ ఎన్నికలతో ముగియనుందనే ప్రచారం జోరందుకుంది. జిల్లాకు శివారున ఉన్న చందాహండి సమితిలో రమేష్ చంద్ర మజ్జి కుటుంబం, జొరిగాం సమితిలో ప్రదీప్ మజ్జి కుటుంబం తరతరాలుగా ఇక్కడి రాజకీయాలను శాసిస్తోంది. ఇరు కుటుంబాలు మధ్య ప్రత్యక్ష వైరం కనిపించకపోయినా.. అంతర్గత రాజకీయ పోరు కొనసాగుతోందనేది అందరికీ తెలిసిందే.

రమేష్‌చంద్ర మజ్జి..

రమేష్ చంద్ర మజ్జి తండ్రి దివంగత జాదవ్ మజ్జి నిరాడంబర వ్యక్తి. సహకార బ్యాంక్ మేనేజర్‌గా పని చేశారు. ఉత్కళ వరపుత్రుడు దివంగత బిజూ పట్నాయక్ ప్రోత్సాహంతో ఉద్యోగానికి రాజీనామా చేసి జనతాదల్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కంచుకోట వంటి నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం నుంచి 1990లో ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. దాంతో బిజూ అతనికి పరిశ్రమల శాఖ మంత్రి పదవి కట్టబెట్టింది. అదే స్థానం నుంచి 1999 వరకు కొనసాగి అనారోగ్యంతో మరణించారు. జాదవ్ మజ్జి నిజాయితీ, నిరాడంబర జీవితం బిజూ కుటుంబం పట్ల నమ్మకం పెంచింది. అనంతరం పెద్ద కుమారుడు రమేష్‌కు వయోపరిమితి రాకపోవడంతో 2004 వరకు ఆగారు. 26 ఏళ్ల వయసులో తండ్రి స్థానంలో పోటీ చేసి బీజేడీ తరఫున గెలుపొందారు. 2009లో డాబుగాం స్థానం రద్దయి జొరిగాం ఏర్పడింది. అక్కడి నుంచి 2019 వరకు మంత్రిగా కొనసాగారు. నవీన్‌కి నమ్మకస్తుడిగా మారారు. 2019లో తమ్ముడు ప్రకాష్ జొరిగాంలో, తాను నబరంగ్‌పూర్ ఎంపీగా గెలుపొంది పార్టీ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

ప్రదీప్ మజ్జి..

జొరిగాంకి చెందిన ప్రదీప్ మజ్జి కుటుంబానికి తరతరాలుగా రాజకీయ నేపథ్యం ఉంది. తండ్రి భగవాన్ మజ్జిని బిజూ పట్నాయక్ జనతాదల్ పార్టీ తరఫున 1994లో రాజ్యసభ ఎంపీగా పంపించారు. ఈ పదవిలో 2000 వరకు కొనసాగారు. 2007లో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ప్రదీప్ అదే ఏడాది జిల్లా పరిషత్ సభ్యుడిగా గెలుపొంది జిల్లా పరిషత్ అధ్యక్షుడయ్యారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున నబరంగ్‌పూర్ ఎంపీగా గెలుపొందారు. 2014, 2019లలో ఆ పార్టీ తరఫున ఎంపీగా ఓడిపోయారు. సన్నిహితుల సూచనతో 2021లో బీజేడీ తీర్థం పుచ్చుకొన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రదీప్‌కి ప్రాధాన్యమిచ్చింది. 2022లో మంత్రి హోదాతో కూడిన స్వతంత్ర అభివృద్ధి మండలి సలహాదారునిగా నియమించింది.

2024 సార్వత్రిక సమరం

ఒక కుటుంబం..ఒకే టికెట్

రాష్ట్రంలో బీజేడీ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నవారు ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక కుటుంబానికి ఒక టిక్కెట్ ప్రతిపాదనను పార్టీ తెచ్చింది. దాంతో ఎంపీ రమేష్ తన ఎంపీ స్థానం వదిలి సొంత నియోజకవర్గం జొరిగాం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రదీప్‌కు నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేడీ పార్టీ తరఫున టిక్కెట్ ఖరారైనట్లు అధిష్టానం సంకేతాలు ఇచ్చింది. ప్రస్తుతం ఇద్దరు నేతలు విభేదాలు పక్కన పెట్టి కలిసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరిద్దరి మధ్య విభేదాలు సృష్టించాలనుకునే వారు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతి విషయాన్ని పార్టీ నిశితంగా పరిశీలిస్తున్నందున పార్టీ అభిమానులు సైతం ఇద్దరి కోసం పని చేయడానికి సిద్ధమవుతున్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నికుంబ బిహారీ దలో

కొరాపుట్: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నికుంజ బిహారీ ధలో ఆదేశించారు. నబరంగ్‌పూర్ జిల్లాలో శనివారం పర్యటించి ఈవీఎంలు భద్రపరిచిన భవనాలను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర మాట్లాడుతూ జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు చేసిన ఏర్పాట్లు వివరించారు. నికుంజ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏడీజీ సంజయ్‌కుమార్, డీఐజీ చరణ్‌సింగ్ మీనా పాల్గొన్నారు.

2024 సార్వత్రిక సమరం

ఫేక్‌న్యూస్‌పై నిఘా



భువనేశ్వర్: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు ఒడిశా పోలీసులు ప్రత్యేక పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి నోడల్ అధికారిగా ఐజీపీ (క్రైమ్ బ్రాంచ్) షెఫీన్ అహమ్మద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్‌కుమార్ షడంగి మాట్లాడుతూ నకిలీ వార్తలు, తప్పుడు సమాచారం గురించి భారత ఎన్నికల సంఘం నుంచి నిర్దిష్ట మార్గదర్శకాలు వెలువడ్డాయని చెప్పారు. సాంకేతిక సమాచార విభాగం సమన్వయంతో ఐజీ ర్యాంక్ అధికారి సోషల్ మీడియాలో అన్ని వార్తల కంటెంట్‌ను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన తప్పుడు కంటెంట్ పట్ల చర్యలు చేపడతారని పేర్కొన్నారు. నకిలీ, రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రసారం చేసే వ్యక్తులు, సంస్థలపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల సూచనల మేరకు పోలీసు అధికారులు శిక్షణ పొందారని, ఈ విభాగం సోషల్ మీడియా సెల్ కూడా నిర్వహిస్తోందని వివరించారు. సంబంధిత ఫిర్యాదులపై సైబర్ సెల్ స్పందిస్తుందని భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. కాగా, రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లోనూ సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు.

జగన్నాథ మందిరంలోకి విదేశీ పర్యాటకులు

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

భువనేశ్వర్: నిబంధనలకు విరుద్ధంగా శనివారం పూరీ శ్రీమందిర్‌లో ప్రవేశించిన మహిళా విదేశీ పర్యాటకురాలిని సింహద్వార్ ఠాణా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పుణ్యక్షేత్రంలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించిన సంగతి తెలిసిందే. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు విదేశీ పర్యాటకురాలిని గుర్తించడంలో విఫలమయ్యాడు. సింహద్వారం ప్రాంగణంలోని 22 మెట్ల సమీపంలో విదేశీ పర్యాటకురాలిని గుర్తించిన ఓ సేవకుడు సింహద్వారం ఠాణా పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఆమెను ఆలయంలోకి రాకుండా అడ్డుకుని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. పర్యాటకురాలు గుర్తింపు, వీసా, పాస్‌పోర్ట్‌ను పరిశీలిస్తున్నారు. పోలీసుల విచారణలో, ఆలయంలోకి హిందువులు కానివారిని అనుమతించరని, ఆలయ మార్గదర్శకాల గురించి తమకు తెలియదని నిందిత విదేశీ పర్యాటకురాలు అంగీకరించినట్లు తెలిసింది.

ఇటీవల బంగ్లా పౌరులు సైతం..

ఆలయ నిబంధనలకు విరుద్ధంగా జగన్నాథ ఆలయంలోకి ప్రవేశించారనే ఆరోపణలపై మార్చి 4న తొమ్మిది మంది బంగ్లాదేశ్ పౌరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంతమంది విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు బంగ్లాదేశీయులు మందిరంలోకి ప్రవేశించడాన్ని గుర్తించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1955 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించి హిందూయేతరులు ఆలయంలోకి ప్రవేశించారని వారు సింహద్వారం ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేమూ సింగిల్ గానే..

- 147 శాసనసభ, 21 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేడీ పోటీ
- మూడు వంతుల స్థానాల్లో గెలుస్తాం: ప్రణబ్‌ప్రకాష్ దాస్



భువనేశ్వర్: ఒడిశాలో ఒంటరిగా పోటీ చేస్తామని భారతీయ జనతా పార్టీ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అధికార బిజూ జనతా దళ్ సైతం మొత్తం 147 శాసన సభ నియోజకవర్గాలు, 21 లోక్‌సభ నియోజక వర్గాల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రజల మద్దతుతో నవీన్ పట్నాయక్ నాయకత్వంలో నాలుగింట మూడు వంతుల స్థానాలకు పైగా విజయం సాధిస్తుందని బీజేడీ ప్రధాన కార్యదర్శి (సంస్థ) ప్రణబ్ ప్రకాష్ దాస్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. నవీన ఒడిశా, సాధికారత ఒడిశా తమ లక్ష్యమని చెప్పారు. జగన్నాథుని ఆశీస్సులు, రాష్ట్ర ప్రజల విశ్వాసంతో మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బీజేడీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) ఒడిశా ప్రజలను ఎల్లప్పుడూ ముందంజలో ఉంచే నిర్ణయాలను బిజూ జనతా దళ్ పాలన కొనసాగిస్తుందని, దేశ నిర్మాణానికి అవసరమైన సహకార సమాఖ్య, రాజనీతిజ్ఞత నిజమైన స్ఫూర్తితో సంక్షేమ కార్యకలాపాల్ని నిరవధికంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

2024 సార్వత్రిక సమరం

మురుగుకూపంలో ఎలా బతకాలి?



మెయిన్ రోడ్డులో ఆందోళన చేస్తున్న స్థానికులు

- కొత్త బస్టాండ్ మెయిన్ రోడ్డులో స్థానికుల ఆందోళన



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పర్లాకిమిడి: కాలువలు చెత్తాచెదారాలతో నిండిపోవడంతో దుర్వాసన వస్తోందని, ఇక్కడ ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తూ పర్లాకిమిడిలోని ఆరో వార్డు డెప్ప ఒడియావీధి, మెయిన్ రోడ్డుపై శనివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. శ్రీకృష్ణా థియేటర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. పర్లాకిమిడి ప్రధాన రోడ్డు నిర్వహణను మున్సిపల్ కౌన్సిల్ నుంచి రోడ్లు-భవనాల శాఖకు అప్పగించటంతో నిధులు లేవని చేతులెత్తేస్తున్నారని, ఈ విషయమై పలు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బీజేడీ టౌన్ ప్రెసిడెంటు సిత్తు మహాపాత్రో అన్నారు. రోడ్డు మరమ్మతులకు రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖకు రూ.10కోట్ల 70 లక్షలు మంజూరు చేసిందని, పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం టైర్లు కాల్చి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సబ్ కలెక్టర్ అనూప్ పండా ఆందోళనకారులతో మాట్లాడారు. రెండు వారాల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'అవినీతిలో కూరుకుపోయిన అధికార పార్టీ'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మల్కన్‌గిరి: అధికార బీజేడీ అవినీతిలో కూరుకుపోయిందని మల్కన్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో బీజేడీ పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొమ్మిది హామీలను గ్యారెంటీగా అమలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవిందపాత్రో, సీనియర్ నాయకులు శరత్ భురద, మంగు ఖీలో, పద్మన్ పంగి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో

పర్లాకిమిడి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, మోహనా శాసనసభ్యుడు దాశరథి గొమాంగో అన్నారు. స్థానిక సాండివీధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు మాఫీ, గృహలక్ష్మీ పథకంలో ప్రతి ఇంటి మహిళకు నెలకు రూ.2వేలు, ప్రతి కుటుంబానికి ఉచితంగా రూ.500 సిలిండర్, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల కుటుంబాలకు రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ సేవలు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు నెలకు రూ.2000, ఐదు లక్షల మంది యువకులకు ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు మంజూరు చేస్తామని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బిభూషణ పాత్రో, కార్యదర్శి అభిమన్యు పండా, పట్టణ అధ్యక్షుడు బసంతపండా, కాంగ్రెస్ యువజన నాయకులు సూర్యనారాయణ పాత్రో, కాంగ్రెస్ మహిళా నేత్రి ఇస్మాన్ రఫీ, మున్నా మహారాణా తదితరులు పాల్గొన్నారు.

జయపురం: కాంగ్రెస్ పార్టీ హామీల మేనిఫెస్టోను పార్టీ నేతలు, కార్యకర్తలు క్షేత్ర స్థాయి నుంచి ప్రజలకు చేర్చాలని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిభూషణ పాత్రో పిలుపునిచ్చారు. శనివారం జయపురంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో మేనిఫెస్టో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, పార్టీ సీనియర్ నేత బినోద్ మహాపాత్రో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, నిశాంక బిశాయి తదితరులు పాల్గొన్నారు.




జయపురం: మేనిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఢిల్లీ వెళ్లిన మన్మోహన్ సామల్

భువనేశ్వర్: రాష్ట్రంలో బిజూ జనతా దళ్‌తో పొత్తు లేకుండా ఒంటరి పోరాటం ఖరారు కావడంతో తదుపరి ప్రక్రియ ఊపందుకుంది. శనివారం జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులకు ఆమోదం లభించవచ్చు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శనివారం ఉదయం ఢిల్లీకి బయలుదేరారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా సమక్షంలో జరిగే కీలక సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉంది. లోక్‌సభ, ఒడిశాలోని కొన్ని అసెంబ్లీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా ఒకటి రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. మన్మోహన్ సామల్‌తో బీజేపీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజింగు) మానస్ మహంతి కూడా దేశ రాజధానికి వెళ్లారు. ఈ సందర్భంగా సామల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు శనివారం సాయంత్రం 6 గంటలకు సీఈసీ సమావేశం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి సీఈసీ, పార్లమెంట్ పార్టీ తుది నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. త్వరలోనే పేర్లు వెల్లడిస్తామని తెలిపారు. మే 13 నుంచి నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

నిర్భయంగా ఓటు వేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర అదనపు చీఫ్ ఎన్నికల అధికారి డాక్టర్ తిరుమల నాయక్

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అదనపు చీఫ్ ఎన్నికల అధికారి డాక్టర్ తిరుమల నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం రాయగడ ఆర్‌డీఏ సమావేశం మందిరంలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలనాయక్ మాట్లాడుతూ అత్యధిక శాతం మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా 80 ఏళ్లు పైబడిన ఓటర్లు, దివ్యాంగులు సైతం ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బు, మాదకద్రవ్యాలు, వ్యాపారాల ద్వారా ప్రజలు ప్రభావితం కాకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. అంతకు ముందు స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాలను నాయక్ సందర్శించారు. స్ట్రాంగ్ రూం పరిశీలించారు. సమావేశంలో ఎస్పీ హరీష్ బిసి, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో తదితరులు పాల్గొన్నారు.

సువిధ యాప్‌పై అవగాహన

పర్లాకిమిడి: ప్రస్తుత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌కు ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన 'సువిధా' యాప్ వినియోగంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బీజేడీ, కాంగ్రెస్, సి.పి.ఎం, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల ప్రతినిధులతో సమావేశమై యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్‌లో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల దరఖాస్తులు, ఎన్నికల ప్రతినిధుల ర్యాలీ, ప్రచార అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవడం తదితర అంశాలను వివరించారు. నాయకుల సందేహాలను ఐటీ అధికారి టి.బాలకృష్ణమూర్తి నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం రాజేంంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనూప్ పండా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్నాథసాగర్ అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న బెహరా

జయపురం: చరిత్రాత్మక జగన్నాథ్ సాగర్ అభివృద్ధి, సుందరీకరణ పనులపై రాష్ట్ర అమొ పొకిరీ(మన చెరువు) యోజన అధికారులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి హడిబంధు బెహర కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, జూనియర్ ఇంజినీర్ అజయ జానీ, ప్రతాప్ ఆచార్యలతో మాట్లాడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ మీడియా కో ఆర్డినేటర్‌గా సునీల్‌కుమార్ సాహు



సునీల్‌కుమార్ సాహు

బరంపురం: గంజాం, కొంధమాల్ జిల్లాల మీడియా కో ఆర్డినేటర్‌గా గంజాం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ సాహును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం లేఖ విడుదల చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

బరంపురం: నగరలోని కాజవీధి ఇందిరా పార్క్ సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.38,650 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



ఆటో నుంచి జారి పడి మృతి చెందిన పార్వతి

కోటబొమ్మాళి: స్థానిక స్టేట్‌బ్యాంకు సమీపంలో ఆటో నుంచి జారిపడి నందిగాం మండలం లఖిదేశపురం గ్రామానికి చెందిన బతకల పార్వతి(45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతి శుక్రవారం కోటబొమ్మాళిలో జరిగిన ఒక శుభ కార్యానికి కేటరింగ్ చేయడానికి వచ్చారు. కార్యక్రమం ముగియడంతో శనివారం స్వగ్రామం వెళ్లేందుకు ఆటో ఎక్కగా స్టేట్ బ్యాంకు సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పార్వతికి భర్త అప్పారావు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: నిమ్మాడ జంక్షన్‌కు చెందిన ఆవల రాజారావు (52) పురుగులు మందుతాగి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజారావు కిడ్నీవ్యాధితో బాధ పడుతూ ఈనెల 20న తన ఇంట్లో పురుగులు మందు తాగేశారు. చికిత్స కోసం రాజారావును రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాజారావు మృతి చెందారు. మృతునికి భార్య తవిటమ్మ, కుమారులు ధర్మారావు, కిరణ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ అలీ తెలిపారు.

'పరిశోధనాత్మక విద్యతోనే ప్రగతి'

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధనాత్మక విద్యతో ప్రగతి సాధ్యమని ముంబైకి చెందిన థెర్మోఫిషర్ సైంటిఫిక్ సంస్థ సౌత్ ఏషియా జనరల్ మేనేజర్ జయభరత్ రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ, థెర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ సంయుక్తంగా నూతన ఆవిష్కరణల కోసం పారిశ్రామిక సమ్మేళనం అన్న అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు ఉండాలన్నారు. ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల ద్వారా పారిశ్రామిక రంగంలో అనేక మార్పులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక ప్రగతి విస్తరిస్తోందని, కృత్రిమ మేధ రావడంతో పరిశ్రమల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ప్రస్తుతం విద్యావిధానంలో సైతం అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. నిరంతర పరిశోధనలతో వైద్య, సాంకేతిక, జీవశాస్త్ర, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో మార్పులు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ ఆంధ్రావిశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పీఎస్‌పీ ధనుంజయ, పలువురు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు రంగుల కళ



గిరి మార్కెట్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



బాపురుబజార్‌లో అమ్మకానికి రంగుల పైపులు



రంగుల దుకాణాల సముదాయం

హోలీ సందర్భంగా మార్కెట్ కళకళలాడుతోంది. రంగుల సామగ్రితో దుకాణాలు కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. బరంపురంలోని కొమ్మాపల్లి రోడ్, బిజ్జీపూరం, గుసానినువాగాం, గిరి మార్కెట్, బాపుర్ బజార్, పెద్ద బజార్, అన్నపూర్ణ మార్కెట్, అర్బన్ బ్యాంక్ రోడ్, రామలింగంట్యాంక్ రోడ్ , గేట్ బజార్, జయపురం పట్టణాల్లో హోలీ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల రంగులతో పాటు పైపులు, టోపీలు, మాస్కులు పెద్ద ఎత్తున అమ్ముడుపోతున్నాయి.

– బరంపురం/జయపురం



జయపురం మార్కెట్‌లో కలర్స్ షాపు

రియల్ హీరో భగత్‌సింగ్



బరంపురం: భగత్‌సింగ్ చిత్రపటాలతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్‌ఓ విద్యార్థులు



బరంపురం: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్



పర్లాకిమిడి: సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళులు



జయపురం: అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

బరంపురం: స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బ్రిటీషర్లకు సింహస్వప్నంగా నిలిచిన రియల్ హీరో భగత్‌సింగ్ అని డెమొక్రసీ స్టూడెంట్ ఆర్గనైజేషన్(డీఎస్ఓ) రాష్ట్ర కన్వీనర్ సోమనాథ్ బెహరా కొనియాడారు. శనివారం బరంపురంలోని ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో భగత్‌సింగ్ జయంతి(సాహిద్ దివస్) నిర్వహించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోమనాథ్ బెహరా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ పోరాటాన్ని చూసి తట్టుకోలేని బ్రిటీషర్లు భగత్‌సింగ్‌తో పాటు సహచరులు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారని చెప్పారు. నేటి యువత వీరిని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భవాని శంకర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

జయపురం: భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు చిరస్మరణీయమని శ్రామిక యూనియన్ జేఏసీ నేతలు పేర్కొన్నారు. స్థానిక రఘునాథ్ మందిర కూడలి వద్ద అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్మిక నేత జుధిష్టర్ రౌళో, ఓఎస్ఆర్‌టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం, సేవా పేపరు మిల్లు కార్మిక సంఘాల ప్రతినిధులు, ఒడిశా ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, మాధవ చౌధురి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక దండుమాల వీధిలోని సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి రోయితో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సి.పి.ఐ.(ఎం.ఎల్) పట్టణ అధ్యక్షుడు శ్రీను బెహరా, బాణీప్రసాద్ మల్లి, ఎం.బంగారి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రొక్కం లోకనాథం, రాకేష్, సంజయ్ అశోక్, కామేష్ సాహు పాల్గొన్నారు.

బంకేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



ఆలయ ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బంకేశ్వరి అమ్మవారు

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం బంకేశ్వరి అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు పరిసర గ్రామాలు, ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శనివారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పించారు. కొండ దిగువున వంటా వార్పు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజ భోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంలో కొలువుదీర్చి మేళతాళలతో ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గంజాం ఎస్పీ బ్రజేష్‌కుమార్ రాయ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులను ఆదుకోని మోదీ ప్రభుత్వం



ఆందోళన చేస్తున్న గంజాం జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు

బరంపురం: రైతులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గాలికొదిలేసిందంటూ గంజాం జిల్లా కాంగ్రెస్ కమిటీ యువజన నాయకులు శనివారం డీసీసీ కార్యలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పితవాసి పండా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించినా ప్రకృతి వైపరీత్యాలు కారణంగా నష్టపోతున్నారని, వీరిని ఆదుకోవడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో జిల్లా పీసీసీ సభ్యులు ఉదయ పాణిగ్రాహి, సాయిప్రసాద్ పాత్రో, రబి అధికారి, సుభాష్ రౌత్, ప్రమోద్ కుమార్ జెనా, సునీత సాహు, సుచిత్ర సాహు, సుదీర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

'వైద్య సదుపాయాలు వినియోగించుకోండి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

పలాస: 'గతంలో కిడ్నీ రోగులకు వైద్యసదుపాయాలు లేవు. ఇప్పుడు ఇంటి వద్దకే వైద్యం అందుతోంది. పలాసలో కిడ్నీ ఆస్పత్రి కూడా వచ్చింది. వినియోగించుకోండి' అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో శనివారం కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు, మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 276 మందికి రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేశారు. జనరల్ ఓపీ 83, కిడ్నీ పరీక్షలు 193 పరీక్షలు చేశారు. అత్యధిక శాతం కిడ్నీ రోగులు ఉన్నట్టు రోగులు గుర్తించారు. వారికి మందులు సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరంలో రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్‌తో పాటు, నెఫ్రాలజిస్టు కె.విద్యాసాగర్, డాక్టరు మౌనిక, డాక్టరు దేవి, డాక్టరు తేజేశ్వరి, డాక్టరు చిన్ని, సుమారు 35 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలాస జూనియర్ ఇన్‌చార్జి సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ హైకోర్టు , సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నెఫ్రాలజిస్టు సూచనలు విధిగా పాటించాలని న్యాయమూర్తి అన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు డయాలసిస్ స్టేజీకి వచ్చినంత వరకు తెలియడం లేదని డీఎంహెచ్‌ఓ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇక్కడ ఆరు నెలలుగా సర్వే జరుగుతోందన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే జీవిత కాలం పెరుగుతుందని అన్నారు.

వేణుగోపాలుని సన్నిధిలో..



వేణుగోపాల ఆలయం

- నేటి నుంచి మెళియాపుట్టిలో డోలోత్సవాలు
- కట్టిపడేసే శిల్ప కళ ఆలయ సొంతం



గర్భగుడిలో విగ్రహాలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి వేణుగోపాల స్వామి ఆలయం డోలోత్సవాలకు సిద్ధమైంది. 1840లో పర్లాకిమిడి మహారాజు ప్రతాపరుద్రుని భార్య విష్ణుప్రియ మహారాణి కోరిక మేరకు ఆలయాన్ని కట్టించారు. పర్లాకిమిడి నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్రతనయ నదీతీరాన మెళియాపుట్టిలో ఉన్న ఈ ఆలయం అపురూప శిల్పకళకు ఆలవాలంగా నిలుస్తోంది.

ఏటా ఘనంగా డోలోత్సవాలు

ఏటా స్వామి వారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం నుంచి ఇక్కడ డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభానికి ముందు రోజు రాత్రి రాజవంశీయులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు, మఘ కార్యక్రమం నిర్వహించి పురవీధుల్లో ఊరేగిస్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక జానపద, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు పూజా కార్యక్రమాలు, శుభకార్యాలు చేసేటప్పుడు ఆయా గదుల్లో సామగ్రి నిల్వచేసి ప్రజలు సేదతీరేవారు. ప్రస్తుతం గదులన్నీ పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి.

డ్రైవింగ్ స్కూల్ 15వ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులకు ఇచ్చే హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు అన్నారు. శ్రీకాకుళంలోని ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్‌ను శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ పి.బి.ఎం.కె రాజు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఇక్కడ డ్రైవింగ్‌తో పాటు మెకానికల్ వర్క్, యోగా, ప్రథమ చికిత్స, ట్రాఫిక్‌కు విషయాలు కూడా చెబుతారని అన్నారు.

తదుపరి బ్యాచ్‌లో చేరదలుచుకునేవారు నేరుగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ డ్రైవింగ్ స్కూల్‌ను సంప్రదించవచ్చని లేదా 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-2డిపో మేనేజర్ కేఆర్‌ఎస్ శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో శనివారం ధ్వంసం చేశామని సీఐ బి.శ్రీధర్ తెలిపారు. 28 కేసులకు సంబంధించి 291 మద్యం బాటిళ్లతో పాటు 9.25 లీటర్ల సారా, 4.5 లీటర్ల ఎన్‌డీపీఎల్‌ను విజయనగరానికి చెందిన అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డీవీజీ రాజు ఆధ్వర్యంలో ధ్వంసం చేశామని వెల్లడించారు. సారా కేసులో పట్టుబడిన ఆటోను రూ.61వేలకు వేలం వేశామని తెలిపారు. అంతకు ముందు రేగిడి మండలం లక్ష్మీపురం జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న బాలికృష్ణారావును అరెస్టు చేసి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

సెంచూరియన్‌లో ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివరామ్ మాలే

నెల్లిమర రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ శివరామ్ మాలే వర్ణ అంధత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్ణ అంధత్వం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 0.5 శాతం మంది మహిళలు, 8.3 శాతం మంది పురుషులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని వివరించారు. నివారణపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు తగ్గిస్తాం..

• ఐఎంఎల్ డిపో మేనేజర్ ఎన్‌వీ రమణ



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ఎన్‌వీ రమణ

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలు తగ్గిస్తామని జిల్లా ఐఎంఎల్ డిపో మేనేజర్ ఎన్‌వీ రమణ అన్నారు. నెల్లిమర్ల ఐఎంఎల్ డిపోలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డిపో పరిధిలో(ఉమ్మడి విజయనగరం) 170 మద్యం షాపులు, జిల్లా పరిధిలో 145 మద్యం షాపులకు సంబంధించి గతేడాది కన్నా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి సేల్స్ తగ్గిస్తామని చెప్పారు. డిపో పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియామవళిని విధిగా పాటించనున్నట్లు పేర్కొన్నారు. బెల్ట్ షాపులు నియంత్రణ చర్యలు చేపడుతున్నామని, మద్యం షాపుల్లో అమ్మకాలపై సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్ అందజేత

విజయనగరం క్రైమ్: గుర్ల మండలం చుక్కపేటకు చెందిన యెండరావు జ్యోత్స్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. సొంత గ్రామానికి వచ్చే క్రమంలో శనివారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోలో లగేజ్, ల్యాప్ టాప్ బ్యాగ్ మర్చిపోయింది. కొద్దిసేపటి తర్వాత విషయాన్ని గ్రహించి ఆటో గురించి వెదికారు. ఆటో వివరాలు తెలియకపోవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేసి, ఆటోను గుర్తించారు. మర్చిపోయిన ల్యాప్ టాప్, లగేజీలను బాధితురాలికి అందజేశారు.

కారుని ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

భోగాపురం: ముందు వెళ్తున్న కారుని ఢీకొని యువకుడు తీవ్ర గాయాల పాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం లింగాలవలస జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన రావాడ జగదీష్ (17) తన ఇంట్లో ఉన్న హోమ్ థియేటర్‌ను రిపేరు చేయించుకునేందుకు స్నేహితుడు ఏలూరు కనకరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం బయలుదేరాడు. హోమ్ థియేటర్‌ను రిపేరు చేయించుకుని తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో లింగావలస వద్ద సర్వీస్ రోడ్డుకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టడంతో జగదీష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్నేహితుడు కనకరాజు ద్వారా సమాచారం అందుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని తగరపువలస ఎన్ఆర్ఐకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని తల్లి రావాడ సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని సీఐ రవికుమార్ తెలిపారు.

ఏవోబీ.. జరభద్రం!

• సరిహద్దుపై నిఘా- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు
• సారా తయారీ బట్టీలపై వరుస దాడులు
• ప్రశాంత ఎన్నికలకు చర్యలు



సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలూ ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉండటం వల్ల అటు నుంచి మద్యం, నగదు, ఇతర తాయిలాలేవీ రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కోడ్ అమల్లో ఉండటంతో పోలీసులు, ఎన్నికల అధికారులు నిఘాను పెంచారు. జిల్లాలో 12 వరకూ పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల వద్ద వీటిని ఏర్పాటు చేయడమే కాక.. వచ్చిన ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెడుతున్నారు. అనుమానితులపై నిఘా పెడుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని అడారు, రావికోన తనిఖీ కేంద్రాల్లో.. పాచిపెంట మండలం పి.కోనవలసలో గస్తీ ముమ్మరం చేశారు. పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికే ఆరు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. పాలకొండ – శ్రీకాకుళం సరిహద్దులో కొండాపురం, పాలకొండ – విజయనగరం జిల్లా సరిహద్దుగా ఉన్న చినమంగళాపురం జంక్షన్, భామిని, బత్తిలితో పాటు కురుపాంలో రెండు చోట్ల గస్తీ కాస్తున్నారు.

కలెక్టర్ నిశాంత్‌కుమార్ శనివారం కురుపాం మండలంలోని మంత్రజోల సమీపంలో మూలిగూడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ అక్కడ నమోదైన కేసులు, వాహనాలు సీజ్ చేసిన వివరాలను ఆరా తీశారు. ఈ ఒక్క చెక్‌పోస్టు వద్దే ఇప్పటి వరకు 9 కేసులు నమోదైన విషయాన్ని గుర్తించారు. 24 గంటలూ పటిష్ట నిఘా ఉండాలని స్పష్టం చేశారు.

పరస్పర సహకారం.. సమన్వయం

ఆంధ్రా – ఒడిశా సరిహద్దు కావడంతో గతంలో చెదురుముదురు సంఘటనలు చోటుచేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా సాగాలంటే పార్వతీపురం మన్యం, రాయగడ, కోరాపుట్ జిల్లాల అధికార యంత్రాంగం మధ్య సమన్వయం అవసరం. అందులో భాగంగా ఇటీవలే మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇక్కడ ఒకే దశలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టడం.. ఉచితాల పంపిణీని నియంత్రించడం, సరిహద్దులో పోలింగు సిబ్బందికి వాహనాలు సమకూర్చడం, కొఠియా గ్రామాల్లో పరస్పర సహకారంతో ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. కలసి నడవాలని నిర్ణయించారు. కొఠియా గ్రామాల్లో ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించాలని, ఎవరూ అడ్డుకోవద్దని నిర్ణయానికి వచ్చారు. మరోవైపు జిల్లాలో 80 సమస్యాత్మక పోలింగు కేంద్రాలను గుర్తించారు. కురుపాంలో 29, పాలకొండ 15, సాలూరు 22, పార్వతీపురం 33 చొప్పున ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ రోజు నుంచి బైండోవర్‌లు ప్రారంభిస్తున్నారు.



బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మద్యం, సారాపై గట్టి నిఘా

ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొమరాడ, పార్వతీపురం, కోరాపుట్ జిల్లా బందుగాం పోలీస్ స్టేషన్ సిబ్బంది పార్వతీపురం మండలం, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. 14,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలమండ గ్రామం వద్ద 32 డ్రమ్ముల్లో ఉన్న పది వేల లీటర్లను, కర్లి గ్రామం వద్ద 15 డ్రమ్ముల్లో లభ్యమైన 4,500 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. మరో బృందం ఏవోబీ అటవీ ప్రాంతమైన లావిడి, కందిలి, ఆలాసి, పూలగుంత ప్రాంతాల్లో దాడులు నిర్వహించి.. 45,000 లీటర్ల సారా, బెల్లం ఊటను ధ్వంసం చేసింది. 480 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కొఠియా గ్రూపు నేరేళ్లవలస కొండ ప్రాంతంలోనూ అడవుల్లో సారా బట్టీలపై సాలూరు రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సారాను, సామగ్రిని ధ్వంసం చేశారు.

పరిమితికి మించి నగదు తీసుకెళ్తే సీజ్

ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లడంపై ఆంక్షలున్నాయి. సాధారణ వ్యక్తులు అన్ని ఆధారాలతో రూ.50 వేల వరకే నగదును తీసుకెళ్లవచ్చు. అంతకుమించి తీసుకెళ్తే.. తగిన ఆధారాలను, కారణాలను చూపించాల్సి ఉంటుంది. బరిలో ఉన్న అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లు రూ.లక్ష వరకూ తీసుకెళ్లవచ్చు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చీరలు, వాచీలు, ఇతర సామగ్రి అధిక మొత్తంలో తరలించడం నేరం. వ్యక్తుల వద్ద బంగారం కూడా పరిమితంగానే ఉండాలి.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశాం. వచ్చిన ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. ఒడిశా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని వెళ్తున్నాం.

– విక్రాంత్ పాటిల్,
ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా

ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీల విజేత 'విజయరాంపురం'

• ద్వితీయ స్థానంలో నిలిచిన గరివిడి జట్టు



విజయరాంపురం శ్రీకృష్ణ యాదవ్ యూత్ జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

తెర్లాం: మండలంలోని విజయరాంపురం(బూరిపేట)లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా విజయరాంపురానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ జట్టు నిలిచింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 38జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో విజయరాంపురం, గరివిడి జట్లు తలపడగా, విజయరాంపురానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, గరివిడి జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది. తృతీయ స్థానాన్ని విజయరాంపురానికి చెందిన వివేకానంద జట్టు సొంతం చేసుకుంది. ప్రథమ స్థానం పొందిన జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న జట్టుకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ధర్మకర్త బూరి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు, మాజీ సర్పంచ్ బూరి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు అమ్మాయిలు అర్హత సాధించినట్లు కోచ్ అనిల్ శర్మ తెలిపారు. ఈ నెల 25నుంచి 28 వరకు మూడు రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా అనిల్ శర్మ అకాడమీ నుంచి కె.శ్రీహిత, కె. హాశిత ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కోచ్ అనిల్‌కుమార్ శర్మ, జిల్లా కార్యదర్శి డీవీ చారి అభినందించారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.90వేలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలు.. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజస్థాన్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.90వేలు విలువైన గంజాయిని వన్‌టౌన్ ఎస్ఐ నవీన్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాగర్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ బృందం స్వాధీనం చేసుకుంది. స్థానిక స్వీట్ ఇండియాకు సమీపంలో ఇద్దరు వ్యక్తులు బ్యాగ్‌లతో వస్తుండగా తనిఖీ చేయగా వారి బ్యాగ్‌లో గంజాయిని గుర్తించారు. విచారణ చేయగా రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర సింగ్, బింజారామ్‌లని, కూలి పని చేస్తుంటామని, గంజాయి అలవాటు ఉండడంతో తక్కువ మొత్తంలో తమ అవసరాలను తీర్చుకుంటూ, మరికొంత అమ్ముకోవాలనే ఉద్దేశంతో సాలూరు వచ్చి, 18 కిలోల గంజాయిని కిలో ఒక్కింటికి రూ.2వేలకు కొనుగోలు చేసినట్టు తెలిపారన్నారు. బస్సులో విజయనగరం చేరుకుని, రైలెక్కేందుకు వెళ్తుండగా పోలీసులకు దొరికినట్లుగా తెలిపారన్నారు. నిందితుల నుంచి గంజాయిని మధ్యవర్తులు, డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ మార్కెట్‌లో రూ.90వేలు ఉంటుందని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి సేవించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు టీవీ చానళ్లు, స్థానిక కేబుల్ టీవీ నెట్‌వర్క్‌లు, ఆడియో విజువల్ ప్రచారం కోసం జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్, మోనిటరింగ్ కమిటీ నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటైన జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడియో విజువల్ ప్రకటనలతో పాటు, మొబైల్ ఫోన్లకు పంపించే బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ సందేశాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఎల్ఈడీ స్క్రీన్లలో వీడియో పబ్లిసిటీ వ్యాన్‌లలో ప్రదర్శించే ప్రచార చిత్రాలకు కూడా జిల్లా స్థాయి కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు లేదా పార్టీలు సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన 48 గంటల్లో వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దినపత్రికల్లో జారీ చేసే ప్రకటనలకు ధరలను నిర్ధారించడం జరిగిందని ఆయా పత్రికలు సాధారణ సమయాల్లో ప్రకటన నెట్‌వర్క్‌లలో ప్రకటనల జారీ కోసం కలెక్టర్ కార్యాలయంలో ఎంసీఎంసీ కార్యదర్శిగా వ్యవహరించిన జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి నుంచి ఆయా ప్రకటలకు దరఖాస్తు చేస్తూ రెండు ప్రతుల్లో ఎలక్ట్రానిక్ రూంలో (పెన్ డ్రైవ్) ప్రకటన కాపీని అందజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, డీపీఆర్‌ఓ డి.రమేష్, కమిటీ సభ్యులు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అసోసియేట్ డాక్టర్ ఐ.తారకేశ్వర్, దూరదర్శన్ కరస్పాండెంట్ పీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సమాచార శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ సిద్ధం చేయండి



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

సీతంపేట: నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో సెక్టార్, రూట్ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రి తీసుకెళ్లేందుకు అనుకూలంగా రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. బస్సులు వెళ్లని పోలింగ్ కేంద్రాలకు బొలేరో, మ్యాక్సి క్యాబ్ వాహనాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లాలోని భామిని, కురుపాం, మునక్కాయవలస(మక్కువ), పురోహితునివలస(సాలూరు)లలోని ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ పగడాలమ్మ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపులలో ఉచిత విద్య పొందేందుకు పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 28 నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బోధన ఆంగ్లమాధ్యమంలో సాగుతుందన్నారు. వివరాలకు హెచ్‌టీటీపీ://ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, హెచ్‌టీటీపీ://సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో వివరాలు చూడాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150లు దరఖాస్తు రుసుముగా చెల్లించాలన్నారు. ప్రవేశాలు 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతాయని తెలిపారు.

98.78 శాతం హాజరు

పార్వతీపురంటౌన్: జిల్లాలో శనివారం జరిగిన పదోతరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 98.78 శాతం మంది హాజరైనట్టు డీఈఓ జి.పగడాలమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు 10,976 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 10,842 మంది హాజరయ్యారు. 134 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మూడు కేంద్రాల్లో నిర్వహించిన ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 632 మందికి 589 మంది విద్యార్థులు హాజరుకాగా, 43 మంది గైర్హాజరయ్యారన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు 445కు 404 మంది విద్యార్థులు హాజరయ్యారని, 41 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉపాధ్యాయుడును సస్పెండ్ చేసిన కలెక్టర్

పార్వతీపురం: ప్రభుత్వ నివాసగృహాన్ని రాజకీయ కార్యకలాపాలకు వినియోగించడంపై ఐటీడీఏ ఉపాధ్యాయుడు, టీడీపీ కురుపాం అభ్యర్థి తోయక జగదీశ్వరి భర్త అడ్డాకుల సన్యాసినాయుడును సస్పెండ్ చేస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నివాసగృహన్ని రాజకీయ కార్యకలాపాల కోసం వినియోగించడంపై 'టీడీపీ జాగీరా' అనే శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన వార్తపై ఎన్నికల అధికారులు స్పందించారు. కురుపాం ఎన్నికల అధికారి వి.వి.రమణ ఇచ్చిన విచారణ నివేదిక మేరకు సన్యాసినాయుడును ఉపాధ్యాయ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారన్నారు.

క్షయ వ్యాధిపై తస్మాత్...

• సర్వజన ఆస్పత్రి జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ సుదర్శి



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సుదర్శి

విజయనగరం ఫోర్ట్: శరీరంలో ఏ అవయవానికైన క్షయ వ్యాధి సోకే అవకాశం ఉందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సుదర్శి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా శనివారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పలమనాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొత్స సంతోష్ మాట్లాడుతూ క్షయ రోగులు కొంతమంది మందులు మధ్యలో మాని వేస్తున్నారని దీని వల్ల వ్యాధి మరింత తీవ్రం అవుతుందని చెప్పారు. క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ రోగులు ఎక్కువగా క్షయ వ్యాధి సోకడం వల్ల మరణిస్తున్నారని తెలిపారు. హెచ్ఐవీ రోగులకు ఏ సమస్య వచ్చినా క్షయ వ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ రోగులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ పీఏ రమణి, డాక్టర్ అజయ్‌కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపుల బలాన్ని చూపిస్తాం



సమావేశంలో ఐక్యతను తెలుపుతున్న తూర్పుకాపు సామాజిక వేదిక సంఘం నాయకులు

విజయనగరం: తూర్పు కాపులమంతా మేల్కొన్నామని... సంఘటితమయ్యామని... రానున్న సార్వత్రిక ఎన్నికల్ల తూర్పు కాపుల బలాన్ని చూపిస్తామని... తూర్పుకాపులకు అన్యాయం చేసిన కూటమికి తగిన బుద్ధిచెబుతామని తూర్పుకాపు సామాజిక వేదిక సంఘ నాయకులు హెచ్చరించారు. తూర్పు కాపు సామాజిక వేదిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి అంబల్ల అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు మాట్లాడారు. ఈ రాష్ట్రాన్ని ఎల్లప్పుడూ రాజకీయంగా, వ్యాపార పరంగా కమ్మ, రెడ్డి కులాల వారే పాలించాలా, మిగిలిన కులాల వారు పాలించేందుకు అర్హులు కాదా? అని ప్రశ్నించారు. తూర్పు కాపు సామాజిక వర్గం ఎప్పుడూ అణగదొక్కబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ, దివంగత నేత కొండపల్లి పైడితల్లి నాయుడు, మాజీ మంత్రులు పతివాడ నారాయణస్వామి నాయుడు, పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత వంటి తూర్పుకాపు సామాజిక నేతలను చంద్రబాబు అణచివేశారన్నారు. అధికార పార్టీ తూర్పు కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యమిస్తున్నప్పటికీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలేదన్నారు. కిమిడి కళా వెంకటరావుకు సీటు కేటాయింపులో దోబూచులాడుతోందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబుకు దమ్ముంటే జగన్‌మోహన్‌రెడ్డి పై పులివెందులలో పోటీ చేసి గెలవాలని ఈ సందర్భంగా సవాల్ చేశారు. చంద్రబాబు తన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారి సీట్లును భద్రంగా ఉంచుకుంటారని, తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన సీట్లు విషయంలో మాత్రం ఇతర కులాల వారిని, ఇతర ప్రాంతాల వారిని తీసుకువచ్చి ఆ సామాజిక వర్గాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తూర్పు కాపులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఇతర సామాజిక వర్గాల వారిని నిలబెట్టాలని చూస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా కోశాధికారి తట్టికాల వెంకటరమణ, న్యాయ సలహాదారు చందక చిన్ని ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో..



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్



ర్యాలీలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

విజయనగరం అర్బన్: ప్రతీ ఒక్కరూ ఓటు విలువను తెలుసుకొని రాజ్యాంగం ప్రసాదించిన హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఓటు వేయడానికి వీలుగా విభిన్న ప్రతిభావంతులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయనగరం మెసానిక్ లాడ్జి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు శనివారం విభిన్న ప్రతిభావంతులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సదరం సర్టిఫికేట్ ప్రకారం 40 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉన్న వారు ఇంటినుంచే ఓటు వేసుకునే వెసులబాటు ఉందన్నారు. అవసరమైన వారికి రవాణా సౌకర్యం కల్పిస్తామని, పోలింగ్ కేంద్రాల వద్ద వలంటీర్లను, వీల్ చైర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందుల కోసం బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పత్రాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ జగదీష్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.